ఏళ్ల ఎడబాటు
ముగిసినవేళ
ఆ ఇద్దరిలో రేగిన
కలవరం?

# స్మృతిరాగం

సుశ్రీ
కథ

“చష్టా!” చుట్టూ వెన్నెలే... అయినా శూన్యంలా కనిపిస్తుంది నీ కొరకు ఎదురుచూస్తున్న నాకు. కానీ ఆ శూన్యంలోనుండి కూడా మత్తయిన సౌరభాలు వెదజల్లుతూ తను కనిపించకపోయినా తన ఉనికిని చాటుతోంది ఓ జాజికొమ్మ, నీ తలపు నా యెదలోలా. కళ్లుమూసుకుంటే కాలం కదిలిపోతుందని కనురెప్ప వేయక చూస్తుంటే కాలం అస్సలు కదలక నాతో ఆటలాడుతుంది.

15 సంవత్సరాల తరువాత తనని కలుస్తున్నానంటే అసలు నమ్మలేకపోతున్నా. కానీ నిజమన్నట్టు మనసంతా సంతోషం... కాదు, అంతకన్నా ఎక్కువే. ఈ రోజు కోసం అసలు ఎదురుచూశానో లేదో తెలీదు. ఎందుకంటే తనను కలుసుకునే సంఘటన ఓ మధురానుభూతి అవుతుందని తెల్సు. అలా అని చెప్పి దానికోసం నేనెక్కువ ఆశ పడితే అది నాకు అందకుండా పోతుందని భయం. కాని మనసులోని ప్రతి అణువు ఈ రోజుకోసం సంవత్సరాలుగా, నెలలుగా, రోజులుగా, క్షణాల్లోని ప్రతి అణువుని లెక్కపెడుతూ ఎదురుచూస్తుంటే ఆపడం నా తరం అయ్యేదికాదు.

నేను కోరుకున్న ఆ సమయం రానే వచ్చేసింది.

తనకి ఎలా స్వాగతం చెప్పను?

మనసులో ఓ చిలిపి ఆలోచన...

తనని ఆట పట్టించాలి... కనిపించకుండా వేరొకచోట కూర్చోవాలి’

ఆశ్చర్యపోయాడు అతను...!

ఇన్నాళ్లు మనసులో పేరుకున్న స్తబ్దత అంతా ఏమైపోయింది?

చిత్రంగా గంతులేస్తోంది ఈ హృదయం... అచ్చు అప్పటిలానే.

తను రాకుండగానే ఇలా వుందే...!



నిజంగా ఆమే ఎదురైతే.. మనసు మూగబోతుందేమో!

ఆ వాస్తవంలో నేను గడ్డకట్టుకుపోతానేమో బహుశా! చప్టా మారాడు అతను. అక్కడినుండి తమ చప్టావైపు చూడసాగాడు. క్షణాలు లెక్కిస్తూ... ఎగసిపడే గుండెను నొక్కిపెడుతూ ఎదురుచూస్తున్నాడు రావాల్సిన ఆమెకోసం.

అనుకున్న సమయానికి ఇంకా పావుగంట

వుంది.

వస్తున్నావా నేస్తం... నాకోసం?

అదిగో... అవును... తనే! వచ్చేసింది, చెక్కు చెదరని చిరునవ్వు మొహంలో కదులుతుండగా!

''కలవరంతోడి నా సిన్ని మనసు
కూసింత సేపైనా కునుకేయనిదే....
గుబులు గుండెతోడ నే సూత్తా వుంటే,
ఇల్లిదిగో అంటూ... నీ రాక!
వెండంటి ఈ యెన్నెల్లో సినుకల్లె నీ సిరునవ్వు
సూడగానే నా గుండె గుబులు
మబ్బుల్లె తేలె!!''

కళ్లద్దాలు ఓసారి సరిజేసుకుని... చుట్టూ చూస్తోంది.

నాకోసమే సుమా!

నేనిక్కడే వున్నాను. వచ్చేస్తున్నాను.

నా మనసు అక్కడే అట్టిపెట్టాను. వస్తావని... నీ పక్కనే తచ్చాడుతూ వుంది.

ఆనందంతో గొడవ చేస్తోంది... నిన్ను చేరమని.

కూర్చుంది తను...

నేను వస్తానని కాబోలు... అటువైపే చూస్తూ వుంది.

ఎంతకీ ఇటు చూడదే...

క్షణాలు దొర్లుతున్నాయి.

కలిశాక మొదట ఏమివ్వను? తనకోసమే విరిసిన...

ఈ రోజాపువ్వునిస్తాను.

తొడిమకి చుట్టిన కవితని తిరిగి చూసుకున్నాడు ఈసారి.

''నిన్ను చూడాలని హడావుడిగా వస్తుంటే...
ఆ అలికిడికి గట్టు వెంబడి నిద్రగన్నేరు మేలుకొని
సంపెంగ సౌరభాలతో తెల్లగులాబికి జాబు వ్రాసింది.
నా పయనం గురించి.
తెల్లగులాబి, నను పిలిచి పింక్‌గా నవ్వి
ఓయ్!
ఈ కొమ్మన పూచాను, నీ యెదలో నిలిచి,
సరికొత్త సౌరభాలు దిద్దుకుని, ఆనక నీ
నెయ్యం సిగలోన మెరిసి, నీ ఒడిలో వాడేను..
నను ఆమె జత చేర్చవోయీ' అంది''

తలెత్తి చూశాడామెవైపు.

వంగి ఏదో ఏరుతోంది. ఏమయి వుండవచ్చు.

తదేకంగా చూస్తూ వుంది వాటివైపు.

అప్పుడు గుర్తుకొచ్చింది అతనికి... ఇందాక నేలమీద వేరుశనగ తొక్కలు కనిపించాయి.

ఎన్నో సాయంత్రాలు మేమిరువురం సమంగా పంచుకున్నవాటిలో అవికూడా వున్నాయి.

నేను వొలిచి ఇచ్చిన వాటిల్లోనే పెద్దవి, మంచివి దాచి తిరిగి నాకిచ్చేది తినమని!

''ప్రేమంటే'' నాదనుకున్న ప్రతీది నీదవడమే''

ఎన్నాళ్లయింది నిన్నుచూసి...
ఇప్పుడనిపిస్తుంది; ఇంతకాలం నిన్ను చూడకుండా ఎలా వున్నానా అని!

''వేగుచుక్క అంబరం నుండి సంబరంగా తొంగిచూస్తుంటే మసక తెరల మాటున ముద్దమందారం ముగ్ధమనోహరంగా విచ్చుకుంటుంది. ఒద్దనుకున్నా నీ తలపు నా యెదపై పరుచుకుంటుంది''

వర్షపు జల్లు మొదలయ్యింది... చినుకు వెంబడి చినుకు...

చాలా అద్భుతంగా అనిపించింది అతనికి...

ఆమెవైపు చూశాడు.

★ ★ ★

ఆ చప్టామీద కూర్చుని అలా చూస్తూనే వుంది ఆమె... చాలా సేపటినుండి. రావాల్సిన అతడు

మాత్రం మరి రాడేమో అనిపిస్తుంది. అసలు అనుకున్నరోజు అదేనా కాదా అని ఓసారి డైరీ తిప్పి పదిహేను సంవత్సరాల క్రితం వ్రాసుకున్న అక్షరాలను తిరిగి చూసుకుంది. ఖచ్చితంగా అదే పౌర్ణమి రోజు... అదే సమయం... అతను స్వయంగా వ్రాసిన అక్షరాలు అవి... ఓమారు తడిమింది ఆప్యాయంగా. వాచివంక చూసింది. తను వచ్చి చాలాసేపయింది. అసలు నాకన్నా ముందే వచ్చి కూర్చునే తను ఇంకా రాలేదేమిటి? నేనే లేట్‌గా వచ్చేద్దాన్ని అప్పట్లో... నాకోసం ఎదురుచూస్తూ.. ఇదే చప్టామీద కూర్చునేవాడు. అల్లంత దూరాన నన్ను చూడ్డంతోటే నవ్వేవాడు కళ్లతో. ఆలస్యంగా వచ్చిన నన్ను కనీసం కారణమేంటనిగాని, ఓ నిరసనగానీ కనబర్చేవాడుకాదు. బహు ఆశ్చర్యపడేదాన్ని! ఖచ్చితంగా టైం మెయిన్‌టెయిన్ చేసే అతను ఈవేళ ఎందుకని రాలేదు. ఇంకా. ఒకవేళ పనుల వత్తిడిలో మరిచిపోయాడా? లేక కదలనీయని పరిస్థితే వచ్చిందేమో!


కానీ ఎప్పటికైనా ఎలా ఇక్కడికి చేరుకుంటాడు నా నేస్తం. ఈ సాయంకాలం మా ఇరువురిది కావాలి. అసలు ఈ క్షణం కోసం ఆనాడు ఒకరినొకరు వీడిన సెకనునుండే ఎదురుచూస్తున్నామంటే అతిశయోక్తి కాదేమో.

ఓసారి చుట్టూ పరికించి చూసిందామె. ఎటుచూసినా వెన్నెలే. దూరాన ఉన్న కొబ్బరాకు చాటునుండి తొంగి తొంగి చూస్తున్నాడు చంద్రయ్య. గాలికి కదులుతున్న కొబ్బరాకుల మీద పడి వింతగా మెరుస్తూంది వెన్నెల.

ఆ ఆకుల కదలికలు, చిరుసవ్వడి... ఈ వెన్నెల... ఇవన్నీ అప్పటి ఆ రోజుల మాదిరిగానే వున్నాయి. కానీ నాలోనే మార్పు. కంటిజోడు... శరీరంలో యవ్వనం తాలూకు శకలాలు... వరించనున్న వృద్ధాప్యానికి స్వాగతం పలుకుతూ నేను. కానీ చిత్రంగా మనసులో మాత్రం ఎట్టి మార్పు లేదు. ఇంకా గంతులు వేస్తూ వుంది ఆనందంతో.

జతగా గతకాలపు అనుభూతులు తోడుండగా వర్తమానం నను మార్చలేకపోయింది.

అప్పటి రోజులు.. గడిచిన క్షణాలు ఎంత అద్భుతంగా వుండేవి! వాచి చూసుకోవడానికే భయపడేవాళ్లం. కలిసిన ప్రతిసారి కొంతసేపు మౌనంగా ఆ క్షణాలు తెచ్చిన ఆనందంతో



గడిపేవాళ్లం... మరలా విడిపోబోయే అరగంట ముందునుండే బాధపడేవాళ్లం. ఇక కలవటానికి వీలుపడదేమో అన్నట్లు ఫీల్ అయ్యేవాళ్లం. అప్పుడు తను వ్రాసినది గుర్తుకొస్తుంది.

''ప్రతి కలయిక ఎడబాటుకు ప్రారంభం.

నిను కలిసిన ప్రతిసారి ఆ ఆనందం వెనుకే విషాదంకోసం పొంచి వుందని అనుకుంటాను. కానీ ఆశావాదిలా ఆలోచిస్తే ఆ క్షణాన ఆనందంలో మునగాలి... అది అంతవరకే... కానీ తరువాత వచ్చే విషాదం దాని వెంబడి ఆనందానికి మొదలనుకుంటే ఆ విషాదం పతనమవుతుందికదా! నిను కలిసిన ఆనందంలో అలానే వుండి విడిపోయిన తరువాత నీ గురించి ఆలోచించక, ఆ ఎడబాటుని ఆస్వాదించకపోతే... మరలా నిను కలవాలనే ఆలోచనా... ఆతురతే వుండదు. ఇక కలయిక అద్భుతంగా ఎలా అవుతుంది నెచ్చెలి?

అందుకే తరచి చూస్తే విషాదం లేకపోతే ఆనందముండదేమో!!''

అంతలో మెత్తని అడుగుల చప్పుడు. జోడు సరిచేసుకుని అదురుతున్న గుండెనరచేత అదుముకుని ఆలోచనలనుండి మళ్లీ అటువైపు చూసింది ఆమె.

అతను వస్తున్నాడు. మెల్లగా నడుచుకుంటూ. ఎలా రిసీవ్ చేసుకోవాలి తనను... లేచి నుంచుని ఆహ్వానించనా... తనకిష్టమైన నవ్వుతో పలకరించనా...! చీకటి తెరలను దాటి... నన్ను సమీపిస్తున్నాడు.

తనలోకూడా వచ్చింది మార్పు... ఆ నడకలో... శరీరంలో... కొంచెం దృఢంగా వున్నాడు. చేతులు జేబులో పెట్టుకుని... నింపాదిగా వస్తున్నాడు. సర్దుకుని కూచుంది. అడుగులు కొద్దిగా నెమ్మదయ్యాయి సంశయంగా. ఆగిన వ్యక్తిని చూడ్డనుగడా...

అసలు 'అతను కానేకాదు'.

కుంగిపోయింది... బాధగా కళ్లు మూసుకుంది ఆమె.

తిలక్ వ్రాసిన 'తపాలా బంట్రోతు గుర్తుకొస్తున్నాడు.

''ఎన్ని గడపలు ఎక్కినా... దిగినా... ఏ ఒక్కరి కళ్లూ తన కోటు దాటిలోపలికి చూడవు.

గుండె లోతుల్లోకి పరికించి చూడలేవు''

ఒంటరితనం!!

ఇంతకాలం తన ఆబ్సెన్స్‌లో భరించిన ఒంటరితనం కంటే... ఇప్పటి ఈ ఎదురుచూపులు... సమయం గడుస్తున్నా ఎంతకీ రాని ''అతడు'' నిజంగా నన్ను ఒంటరిని చేసినట్లుంది.

వెనక్కి తిరిగి చప్టాని ఓ మారు చూసింది. ఎన్ని సాయంత్రాలు ఇక్కడ గడిచిపోయేవి! మాటలు రానప్పుడు కలంతోనే కాగితంమీద భావాలని పలికించేవాళ్లం. ఎంత అద్భుతంగా వ్రాసేవాడు!

''ఓ ప్రత్యూష పవనం కోకిలమ్మ పాటను మనం కూర్చున్న చోటుకి చేర్చుతుంటే... అది మన కలయికకు మరింత శోభనిస్తే మన కలియిక ఆ సాయంత్రానికి ఆభరణమయింది''

ఓ సాయంసంధ్యకు అతడు చెప్పిన భాష్యం!!

ఉవ్వెత్తున రేగిన గాలికి వేరుశనగ తొక్కలు శబ్దం చేసుకుంటూ కదిలాయి. వంగి వాటిని ఏరుకుంది ఆమె... ఏ జంట విసిరివేసినవో... ఎప్పుడూ వలచి ఇచ్చేవాడు. మాకు తోడుగా ప్రతి రోజూ అవి వుండేవి. కాయలోని రెండు విత్తనాల్లో ఒకటి తిని బాగుంటేనే... రెండవది నాకిచ్చేవాడు. ఒకటేమిటి! ప్రతి చిన్న విషయంలోనూ ప్రేమను పంచేవాడు. ఒక్కసారిగా దుఃఖం కమ్ముకుంది. గుండె బిగబట్టినట్లే వుంది. నే బ్రతికుండగా తనని చూడగలుగుతానా... కనీసం ఒక్కసారైనా... నాకు

ఊరటనివ్వడం ఇష్టం లేనట్టు... ఓ కన్నీటి చుక్క అయినా రావడంలేదు.

తొక్కులు విసిరేసి రుమాలు తీసుకుంది చేతులలోకి. అతను ఇచ్చినదే. అక్కడక్కడ చిన్న చిన్న చిరుగులు... అయినా నాకు స్వాంతననిస్తూనే వుంది... తను మిగిల్చిన జ్ఞాపకాలకు గుర్తల్లే.

అనుమానమెుచ్చి చుట్టూ చూసింది. ఎక్కడైనా వచ్చి కూర్చున్నాడేమో... అప్పుడప్పుడు ఆట పట్టించేవాడు. కానీ దొరికిపొయ్యేవాడు. ఈసారి పటిష్టంగా ప్లాన్ చేసుకుని వచ్చాడేమో నన్నేడిపించడానికి!

అక్కడక్కడ పలుచగా వున్నారు జనం. చివ్వరి చప్టామీద ఓ జంట... ఈ ప్రక్క అసలు ఎవ్వరూ లేరు. అటూ ఇటు తిరుగుతున్న వాళ్లే ఎక్కువ. వాళ్లల్లోకూడా తను లేడు. ఎదురు చప్టామీద ఓ వృద్ధుడు... ప్రక్కనే పంచె కట్టు నడివయస్కుడు. అంతకు మించి ఎవ్వరూ లేరు.

అంతలో చినుకులు... ఒకదానివెంట ఒకటి. లేవబుద్ధి కాలేదు. తడిచిపోవాలనిపిస్తోంది. చిన్నప్పుడు జలుబుచేస్తుందని నాన్న తడవనీయలేదు. యౌవనంలో తల్లి ఆంక్షలు!

మరి ఇప్పుడు?

వర్షం వుంది!

ఎవరూ ఏమీ అనరు!

కానీ తోడే లేదు...

''జీవితం వుంది, అదృష్టం వుంది.

తాజ్‌మహలూ వుంది.

కానీ ఎవరికోసం అది కట్టబడిందో... ఆ ముంతాజ్‌కి దాన్ని చూసే అదృష్టం లేదు.''

ఎంతకీ రాదే!

కనీసం కంటనీరైనా రాదే...

అందుకే ఈ జల్లులో నేను తడిచిపోవాలి...

ఈ గుండె బరువు తీరిపోవాలి...

చుట్టూ చూసింది... చాలామంది వెళ్లిపోయారు. షెల్టర్ కింద చేరారు కొంతమంది.

నిరాశ... నిస్పృహ... ఇవన్నీ నన్ను నిస్సత్తువ చేస్తున్నాయి. ఎన్ని యుగాలుగా ఎదురుచూస్తున్నాను అతనికోసం!

సమయం అయిపోయింది. ఇక రాడా అతను.

లేచి నిల్చుంది ఆమె. తడిచిన బాహువును చీర చెరుగుతో చుట్టి... ఇంకా అడుగంటని ఆశతో అతని రాకకోసం చూసి కదిలింది. ఓసారి వెనక్కి

## రహస్యం

''మీరు ఇంత మంచి కథలు ఎలా వ్రాయగలుగుతున్నారు?'' అడిగాడు.

''ఆ రహస్యం చెపితే నా ఉద్యోగం పోతుంది!'' చెప్పాడు పోస్ట్‌మేన్.

- డి. క్రిస్టఫర్‌బాబు (మణుగూరు)



తిరిగి చప్టాని పరికించి చూసింది. కంటినలుముతున్న కన్నీటి తెరలోంచి...

ఒంటరిగా ఆ చప్టా...

విసిరేసిన వేరుశనగ తొక్కలు... కనిపించాయి.

భారంగా ఒక్కో అడుగు వేస్తూ కదిలింది ఆమె.

ఎదురుగా వస్తూ... వేరు శనక్కాయలు అమ్మే మామ్మ... మా ఇద్దరినీ ఎప్పుడూ పరామర్శించే మామ్మ!

పూసలదండే వుంది మెడలో... బుట్ట సైజుమాత్రం చిన్నదయింది. నా దగ్గరికొచ్చి ఆగింది కావాలా అన్నట్లు.

''ఒద్దు'' అని ముందుగు అడుగువేయబోయాను...

ఎంతో దూరాన్నుంచి గాలిలో తేలుతూ ''అమ్మీ'' అన్న పిలుపు వినిపించింది. ఎంతో మధురంగా. ఎలా చెప్పను. నా హృదిలో... శరీరంలో... అణువణువునా వ్యాపిస్తున్న ప్రకంపనలు. ఎన్నాళ్లుగా ఎదురుచూస్తున్నాను ఈ పిలుపుకోసం... కేవలం అతను మాత్రమే... పిలిచే పిలుపు... ''అమ్మీ'' నన్నే ... పిలిచే ఆ పిలుపు. నా అణువణువునీ పలకరించిన ఆ పిలుపు... అతడు నన్ను చేరేలోపే నేనే వెళ్లి అతని చెంత నిలవాలి... ఎంతగా ఎదురుచూస్తుందో ఈ అమ్మీ అతనికి తెలపాలి... గిరుక్కున వెనుతిరగబోయింది. అంతలో...

మామ్మ... ''ఆ వస్తున్నానయ్యా'' అంటూ శక్తి ఉన్నంతమేర గబగబా నడిచింది అటువైపు.

వెనక్కి కూడా చూడబుద్ధేయలేదు.

అయిపోయింది. నా స్నేహితుడు కాదు అతను. నిలువునా కృంగిపోయింది మనసు. ఇప్పుడే ఈ క్షణమే... నేలమాళిగయితే బాగుండును. ఏదీ ఈ భూమి చీలిపోదేం... నను తనలో కలుపుకోదే...!

ఆసరాగా పోల్‌కి ఆనుకుంది. కళ్లు మూసుకుంది ఓ క్షణంపాటు.

''నేస్తం! ఆనాడు... నాలోనుండి... నా గుండెలోనుండి నడుచుకుంటూ వెళ్లిపోయావు.

నీవెళ్లిపోయినా నీ అడుగులు అలానే వున్నాయి.

నీ తాలూకు పరిమళం ఇంకా వీడలేదు

అనుకున్నది అనుకోనిదిగా జరిగిపోయినప్పుడు...

గుండె గోడలపై సమ్మెటపోటులయ్యాయి.

అప్పటి నీ నిష్క్రమణ శాశ్వతమని ఇప్పుడు తెలిసింది.

ఈ నిజాన్ని భరించే శక్తి నాకు లేదు మిత్రమా!

ఏమయిపోను నేను''

స్తంభానికానుకున్న శరీరం నేలకు జారిపోతున్నట్లుంది.

చాలా దగ్గరగా... అతి సమీపంలో ''అమ్మీ'' అన్న పిలుపు... లేదు లేదు. నేను వినడంలేదు... అది భ్రమ మాత్రమే... ఇంకా ఆశతో అతనికోసం వెదకలేదు.

మళ్లా అదే పిలుపు. నన్నేనా పిలిచేది...

నన్ను సమీపిస్తుంది అడుగుల చప్పుడు.

కళ్లు ఇంకా గట్టిగా మూసుకుంది. ఎక్కడ అతనికోసం తెరుచుకుంటాయో అని... ఒకవేళ తను కాకపోతే ఇక ఓటమినెదుర్కునే ధైర్యంలేక.

క్షణాలు లెక్కేసింది. అతను తనను దాటి వుండొచ్చనుకుంటూ. మెల్లగా కళ్లు తెరిచింది.

ఎదురుగా నా స్నేహితుడు. 'అతడు' అదే చిలిపినవ్వు. కళ్లలో అప్పటి వింత మెరుపు.

తనవైపే చూస్తూ... సమీపంలో. అప్పుడు తెరుచుకున్నాయి. ఆమె కళ్లల్లోని కన్నీటి తెరలు... అతని రూపం భద్రపరచుకోవడానికా అన్నట్టు. మరి కొంచెం ముందుకు వంగాడు ''అతను'' ఆమె కన్నీటి చుక్కలని తుడవడానికి.

అప్పటి ఆ ఆనందపు క్షణాలు తిరిగి నన్నల్లుకున్నట్లయింది.

ఇద్దరి పెదవులపై చిరునవ్వు.

''నిశ్శబ్దంలో నేను మౌనంగా కూర్చుంటే నీ జ్ఞాపకం నా పెదాలపై చిరునవ్వు అవుతుంది. ఆ చిరునవ్వును సరిగమలుగా చేసుకుని మనసు ఆనందభైరవి ఆలపిస్తుంది''

చెయ్యి పట్టుకుని నడిపించాడు అతను. అదే చప్టా... అదే వెన్నెల. మరలా అవే రోజులు లాంటి క్షణాలు వారిరువురికి స్వాగతం చెబుతూ!!

★ ★ ★

చప్టామీద కూర్చున్నారు ఒకరి ఎదురుగా ఒకరు. ఆమె ఒకచేయి అతని చేతిలో వుంది అతని చేతిలోని చిన్న ప్రకంపన తనకి తెలుస్తున్నట్టుంది. మరొకటి చప్టాకి ఆనుకునే దానిమీద వేసింది.

చేతిలో వేసిన చెయ్యి మౌనంగా మాట్లాడుతుంది. మౌనమే వారి మధ్య భాషని కూర్చుతున్నది. అలా అతను కళ్లలోకి చూస్తుంటే ఆమె అతని కళ్లలోకి చూస్తుంది రెప్పవేయక. అవే కళ్లు, పెదాలమీద విరిసే చిరునవ్వు మెరుపు ఆ కళ్లలో కదలాడుతుంది.

''రాత్రి అన్నం తిన్నావా'' 15 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా అడిగిన ప్రశ్న ఉవ్వెత్తున ఎగసే కెరటం. ఆకాశంనుండి తెగి రాలిపడిన ఓ చినుకును తనలో కలుపుకున్నట్లు ఊహించని ప్రశ్నను కలుపుకుని మౌనంగా తలాడించింది తిన్నానన్నట్టు.

''ఎలా వున్నావు'' పెదాలు చిన్నగా కదుపుతూ అడిగింది మెల్లగా.

''నీవులేకుండా జీవచ్ఛవంలా బ్రతుకుతున్నానని ఆత్మవంచన చేసుకోనుగాని, ఎంత ఆనందంగా వున్నా ఎక్కడో వెలితి, తరచి చూస్తే నీవులేవన్న సత్యాన్ని గుర్తుచేస్తున్నాయి'' అన్నాడు.

నేను నీకు 15 సంవత్సరాల్లో అసలు గుర్తుకు వచ్చానా అని అడిగాడు.

''లెక్కలేనన్నిసార్లు! ఏ రైలు చూసినా, కోయిల కూసినా మామ్మ వేరుశెనగలు వగలుపోయినా నీ ఆలోచనలు... నా మనోఫలకంపై మొగ్గతొడుగుతాయి'' అని అంది.

''అవును! నీకు నేనెప్పుడు గుర్తుకు వస్తాను'' అని అడిగింది.

## పాపం ఆమని



ప్రస్తుతం మనకున్న అందాల నటీమణులలో ఆమని ఒక్కతి అని చెప్పుకోవచ్చు. శుభలగ్నం, నేటి 'ఆలు మగలు' చిత్రాల్ని తీసుకుంటే ఆమనిలో చక్కని టాలెంట్ వుందని నిస్సంకోచంగా చెప్పవచ్చు. అయితే ఇటీవల ఆమనిమీద కొన్ని పుకార్లు వచ్చాయి. మద్రాసులో ఓ నర్సింగ్‌హోమ్‌లో చేరిందని, అబార్షన్ చేయించుకుందని, కన్నడ హీరోతో సన్నిహితంగా మెలగడంవల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని, అయితే ఆమని ఈ పుకార్లను కొట్టేస్తూ 'అప్పాజీ' అనే కన్నడ చిత్రంలో నటించేందుకు చిక్‌మగళూరు వెళ్లడంతో అక్కడ వాతావరణం, ఆహార పానీయాలు సరిపడక అనారోగ్యానికి గురై నర్సింగ్‌హోంలో చేరాను. అంతేగాని ఈ పుకార్లు అన్నీ ఒట్టి అబద్ధాలే'' అంటుంది ఆమని.

- సుబ్బారావు

''గుర్తుకురావు'' ప్రశ్న వెంబడే విరామం లేకుండా జవాబు కళ్లలోని మెరుపు నిశ్శబ్దంగా వ్యాయమవుతుంటే చేతిలో చేయి వెనక్కి లాక్కుంది తనకు తెలీకుండానే.

అప్పటిదాకా తన చేతిలో వున్న అతని చేయి ఇప్పుడు ఎలా వుందో చూస్తూ కొద్ది క్షణాల మౌనం.

''నీ సన్నిధిలో వున్న కొద్ది సమయంలోనే జీవితానికి సరిపడా అనుభూతులు పంచి నన్ను వదిలివెళ్లిపోయావు. తర్వాత మరే స్త్రీ నా మనసుకు దగ్గరయ్యే అవకాశం రాలేదు. నా తనువుకు దగ్గరయిందేతప్ప. అన్ని అనుభూతులు... మధుర జ్ఞాపకాల్లో ఉన్న నేను ఇంక నిన్ను ఎలా మర్చిపోతాను? మర్చిపోనప్పుడు గుర్తుకు ఎందుకు తెచ్చుకుంటాను!

నా జీవిత పుస్తకంలో నీవు ఓ పేజీవో, భాగానివో కాకుండా ఆ పుస్తకం ముఖచిత్రం అయ్యావు. ఇక ఎలా మరచిపోతాను. కానీ, నీకు సంబంధించిన ప్రతి విషయం గడచిపోయిందేకాని, వర్తమానం కాదన్న నిజం నన్ను బాధిస్తుంది.

నీవు దూరం అయిన తర్వాత ఎన్నిరోజులు ఈ చప్టా దగ్గరకు వచ్చానని! ఎన్ని రోజులు ఇక్కడ ఏడ్చానని! ఎందుకో తెల్సా? ఇలా జరుగుతుందని... ఎడబాటు తప్పదని తెల్సి నీతో అనుబంధాన్ని ఎందుకు పెంచుకున్నానా అని. కాని అదే మనసు... కావాలంటే చిగురవ్వు పుట్టదు. వద్దనుకుంటే విషాదం ఆగిపోదు. అలానే నీ పరిచయం, అనుబంధం. అవికూడా నా ప్రమేయం లేకుండానే నన్ను అల్లుకున్నాయి. వెనక్కి తిరిగిచూస్తే ఓ మల్లెతీగకి, మందారకొమ్మకి కట్టిన అంటులాంటి అందమైన ఓ బంధం. అది అనుభూతులు పంచిందే తప్ప విషాదాలుకాదు. అసలు మన విషయాలు మాట్లాడమనాలేగానీ నాకు కాలం తెలీదు''

ఒక్కసారి ఆపి వింటుందో లేదోనని ఆ కళ్లలోకి చూసేసరికి ఎప్పుడు వచ్చిందో కంటి కొనలోనుండి తొంగి చూస్తోంది ఆనందం! అయినా 'వింటున్నావా' అనడిగాడు.

వింటున్నట్టు తలూపింది.

'ఏంటి? ప్రతిదానికి తలూపుతావు? మాట్లాడవా లేక నేను మాట్లాడడం నచ్చడంలేదా' అన్నాడు.

ఎందుకు వింటంలేదయ్యా! శరీరంలోని ప్రతి అణువు వింటుంది. ఎన్ని నెలలు.... ఎన్ని సంవత్సరాలనుండి ఎదురు చూస్తున్నాననుకుంటున్నావు ఈ రోజుకోసం. నా మనసులో ఎగిసే నీ ఆలోచనలు ఆపడానికి ఎన్ని నరాల గొంతు నులిమేదాన్ని, కారణం తెలీదు! ఎందుకో తెలీదు కానీ నేనెప్పుడూ నీ సన్నిధిని కోరుకున్నాను. అందుకే కదా... ఈ కొద్ది సమయం కోసం ఎప్పటినుండో ఎదురుచూస్తుంది. నాది ఆడ మనసయ్యా! ప్రతి చిన్న అనుభూతికి రెట్టింపు స్పందిస్తుంది. నీకే అంత అలజడయితే మరి నాకెలా వుంటుందనకుంటున్నావు. కానీ వ్యక్తపరచడంలోనే అశక్తురాలినవుతున్నా! అందుకే నీ సమక్షం మౌనం తోడయింది అని మనసులో అనుకుని -

''నీతో కాక ఎవరితో మాట్లాడతాను? అందుకే కదా ఇంత దూరం వచ్చింది... కాకపోతే నిన్ను కలిశానన్న ఆనందంతో ఏమి మాట్లాడాలో తెలీడంలేదు'' అంది.

★ ★ ★

వారి భాష్యాలకి చంద్రుడు వెన్నెల కురిపిస్తే కొబ్బరాకులు వింజామరలయినాయి. పిల్లవాయువులు మత్తు సౌరభాలు వెదజల్లాయి.

మాటల్లో పడి వెన్నెల్లో తడిసి ముద్దయ్యారు. పక్కనే ఆగిన రైలు వేసిన కూతకి ఉలిక్కిపడి

వాస్తవంలోకి వచ్చారు.

వద్దనుకుంటూనే గడియారంవైపు చూశాడు. సమయం మించినట్లు తెలుస్తుంది. కాని తప్పదు. విడిపోక తప్పదు. కాని సమయం అయినట్లు తనకు చెప్పడం ఎలా అని అనుకుంటూ ''అవును మనము మళ్లీ ఎప్పుడు కలుస్తాము'' అని అడిగాడు.

''మనము ఇంకా పెళ్లవక ముందే మళ్లీ ఎప్పుడు కలుద్దామంటావేంటి?'' అని అంటూ వాచీవైపు చూడబోయి ఆగిపోయింది.

మౌనంగా తలదించుకుంది. ఎంతసేపటికీ తల ఎత్తకపోయేసరికి ''ఏంటి మాట్లాడ్డం ఆపేవు'' అని గడ్డం పట్టుకుని పైకెత్తాడు.

కళ్లల్లో నీళ్లు చెంపలపైనుండి కారుతుంటే...

''నేనిప్పుడు వెళ్లవలసిందేనా? ఏం నేనెందుకు ఇక్కడ వుండకూడదు?... చెప్పు ... ఎందుకు సమయం మించిందని అంటున్నావు?'' చిన్నగా అందామె.

అంతలోనే ఒక్కసారిగా కోపంతో ''అసలు నీవు ఎందుకు వచ్చావు ఇక్కడికి? నీవు రాకపోతే కొంచెం సేపు చూసి వెళ్లిపోయేదాన్ని కదా... ఎందుకు... ఎందుకు ఇలా చేశావు... చెప్పు'' అని చొక్కా పట్టుకుని కుదుపుతూ ఏడ్వసాగింది.

''అరె! తనేంటి, ఏమీ మాట్లాడలేకపోతున్నాడు. అవును... నాకేమయింది? మాటలు గొంతు దాటి రావడంలేదు. ఛ! నాకేమీ కాలేదు. నాకు మామూలుగానే వుంది. తనే పిచ్చిది. బాధపడుతోంది.

అయ్యో! ఏమవుతుంది నాకు! గుండెలో చిన్న అలజడి, భరించలేని బాధ. అది అంతకు అంతలై గుండెగోడల్ని గండికొడుతూ పైకి తన్నుకువస్తుంది. తప్పదు. తను దాన్ని అణచివేయాలి. దాని తాలూకు ఓ బిందువైనా నా కంటిలో కనపడినా తనకు మామూలుగా వెళ్లలేదు. ఇన్ని సంవత్సరాల తర్వాత కల్సి విడిపోతున్నప్పుడు తనకి ఆనందాన్ని ఇవ్వాలి తప్ప విషాదాన్ని కాదు'' అని మనసులో అనుకుని -

''ఏయ్!'' ఏంటిది చిన్నపిల్లలాగా'' అసలు మనము విడిపోతున్నామని ఎవరన్నారు? కాకపోతే తిరిగి కలుసుకునేదాకా చిన్న విరామం అంతే! దానికి ఇంతగా బాధపడతావెందుకు. నీవు బాధపడితే నే తట్టుకోలేనని తెల్సుగా మరి తెల్సీ ఏడుస్తావెందుకు

## జంట

''ఏవండీ ఆ సుబ్బారావు దంపతుల్ని చూడండి! ఒకరిపై మరొకరికి ఎంత ప్రేమో? ఒక్క క్షణం కూడా విడిచి వుండరుకదా!''

''అది ప్రేమకాదు రాధా! ఒకరిపై మరొకరికి అనుమానం. అందుకే ఇలా కల్సి వస్తుంటారిద్దరూ''

- మల్లెంశెట్టి లక్ష్మణరావు (పిడుగురాళ్ల)



చెప్పూ' అన్నాడు.

తిరిగి తనే, ''అవును! నాకోసం ఏమి తెచ్చావు? నీకోసం చూడు నేను ఈ కాయలు కోస్తాను అని చప్టా పక్కనున్న చెట్టువైపు అడుగేశాడు.

రాయి తీసుకుని ఓ చేయి వెనక్కి బలము లేనట్టు విసురుతుంటే అది చూసి అంత బాధలోనూ ఓ సంతోష కెరటం గుండెలోనుండి లేచింది. ఎందుకంటే తాము పాతరోజుల్లో కలిసినప్పుడు ఆమెని చెట్టుకాయలు కొట్టమని అడిగేవాడు. తను కొడితే వెక్కిరిస్తూ అలానే విసిరేవాడు. ఎంత అల్లరి చేసేవాడో! అది గుర్తుకు వచ్చేసరికి తనకు తెలీకుండా ఓ చేయి లేపి 'తంతాను' అంది.

హమ్మయ్య! అంటూ వచ్చి చప్టామీద కూర్చున్నాడు. చేతిలో ఓ ప్యాకెట్ వుంచింది. విప్పబోతుంటే ''ఇప్పుడుకాదు. ఇంటికి వెళ్లిన తర్వాత'' అంది.

''నా కోసం ఏమి తెచ్చావు'' అంది.

''నీకోసమేకదా ఈ డ్రస్. తెల్ల పంచా, చొక్కా, తగుడ్డ కట్టుకుంటే జానకిరాముడులా వుంటానన్నావుగా! అందుకే ఇలా వచ్చాను'' అన్నాడు.

పెదాలమీద చిరునవ్వు పేరుకుంటుండగా 'మరి కావడి' అంది.

'అదీ తెచ్చేవాడినే కాని అశోక్‌గాడు పెద్దాడు అయ్యాడుకదా వాడికి ఇచ్చాను, నీ పేరుచెప్పి'' అంటూ పైకి లేచి చేయి అందించాడు.

అయిష్టంగానే లేచి చేతిలో చేతిని విడవకుండా కొంతదూరం నడిచారు. చేతిలో చేయిని వెనక్కి లాక్కుంది వెళ్తానన్నట్టు... అతన్నిక వుండమన్నట్టు. అలా చూస్తూ వున్నాడు. ఆమె రూపం చిన్నది అవసాగింది క్రమంగా.

అవును! తనేంటి ఏమీ తేలేదని చెప్పాడు. ఆమెకి నచ్చినా నచ్చకపోయినా అపురూపమైనది ఇస్తున్నాడు. అంతే దానిలో ఆలోచించడానికేముంది అని ఆమెవైపు పరిగెత్తాడు.

తన పక్కనే శబ్దం అవడంతో ఉలిక్కిపడి చూసింది. రొప్పుతూ అతను. ముక్కుమీదనుండి చెమట్లు. వెనుకవైపునుండి ఓ కవరు తీసి ఇచ్చి అదే వేగంతో వెళ్లిపోయాడు.

★ ★ ★

వెనక్కి తిరిగి వచ్చి చప్టామీద కూర్చున్నాడు. ''ఏమి ఇచ్చిందా అని టెన్షన్. మొదటినుండి అంతే నేను. తమ పరిచయం బాగా పెరిగిన తర్వాత తను నా బుక్స్‌లో కొన్నిసార్లు కవితలు వ్రాసేది. అందుకని ప్రతిరోజూ రూమ్‌లో పుస్తకంలో ప్రతిపేజీ వెదికేవాడిని ఏమన్నా కనబడుతుందేమోనని. కొన్నిసార్లు నిజాలు, కొన్నిసార్లు అబద్ధాలు అవుతాయి నా ఊహలు'' అని అనుకుంటూ తెరిచాడు.

మొహంమీద మెత్తని స్పర్శ, పలుచనివస్త్రం. ఏంటా? అని తీస్తే 'ఆకుపచ్చ చున్నీ తెరిచిన వెంటనే గాలికి లేచినట్టుంది. ఇంకా ఏంటా అని తొంగిచూస్తే ఓ కాగితం ఆత్రంగా తెరిచి చూస్తే -

''అక్కడ నీవున్నా
ఇక్కడ నేనున్నా
నా ఆలోచనలలో నీవు
నీ ఎదలో నేను లేకపోలేదు.
నే బాధగా వున్నప్పుడు నీవు ఆసరా..
అంతే ఆనందం సొంతమైనప్పుడు కూడా నీవుంటావు ఎల్లప్పుడూ.
అందాక నీతో వుండి అంతలో వింతగా...
ఎలా మరిగిపోతాను.
నేనెపుడూ ఇక్కడే
నీవెపుడూ అక్కడే
అయినా మనసులొక్కచోటే

వెలుగువెంట నే నడిచిరాకున్న చీకటిలో ఒత్తినై నే వెలగనా''

దాన్ని అలా ఎత్తుకొని గుండెలమీద వుంచుకుని ఆకాశంలోకి చూడసాగాడు.

★ ★ ★

బస్సులో కూర్చుని ''ఏంటి వచ్చి ఇచ్చివెళ్లాడు? ఏమీ మాట్లాడలేదు సుత్తిమొహం!'' అనుకుంటూ తెరిచింది.

గుండెను వుంచులో వుంచిన భావన కల్గుతుంటే కనులు వెడల్పు అయినవి.

'రుధిరం!' రుధిరాన్ని వర్ణంగా చేసుకుని వేలి కొసల మధ్య కుంచెను కదిలి పనసలో ప్రేమకు రూపం పోశాడేమో!

''నవ్వుతున్న తన రూపం'' అతని రక్తంతో గీసింది.

కిందనే ఇలా వుంది.

''నిను కొలుతునే నీ పెదాల ఒంపున విరిసిన
చిరునవ్వు ఊపిరై నన్ను బతికింప''

ఆమె చేతులు అదురుతుండగా మృధువుగా స్పృశించింది ఆ బొమ్మను. *

